
# చూపుడు వ్రేలు

"డ్రైవర్? . స్పీడ్! . స్పీడ్! . . "

అపార్థం చేసుకోబడిన హీరో, 'బాలసుబ్రహ్మణ్యం' నేపథ్యంలో పాడుతూ— ఆత్మహత్య చేసుకునే నిమిత్తమై ఏ 'బోట్ డోర్'ని ఎన్నుకుని ఉంటాడో ముందుగానే తెలుసునన్నట్లు డ్రైవర్‌ని తొందరచేసే తెలుగు హీరోయిన్లా — చిరంజీవరావ్, మిత్రుడు



విశ్వనాథమూర్తి—

స్టేషన్ వచ్చింది. ఆటో ఆగింది.

రైల్వే బుకింగ్‌దగ్గర ఆ చివర్నించి ఈ చివరికి, పేద్ద 'క్యూ'. రైలు అప్పటికే ప్లాట్‌ఫాం మీద ఆగివుంది. ఒగుర్చుకుంటూ వొచ్చి 'క్యూ'లో నిల్చున్నాడు చిరంజీవరావు. ప్రక్కనే విడిగా నిల్చున్నాడు 'కంపెనీ'కోసం వచ్చిన విశ్వనాథమూర్తి. 'క్యూ' చేంతాడు చివర కళ్ళారా చూద్దామని, తన బైనాక్యులర్ లెన్స్‌లాంటి కళ్ళని సెట్‌చేసి చూస్తాడు చిరంజీవరావు. "నాన్సెన్స్!" — అన్నాడు చిరాగ్గా. "ఇదే కలకత్తాలో అయితేనా " అన్నాడు. అని ఊరుకున్నాడు. (చిరంజీవరావు మూడేళ్ళుగా కలకత్తా మహానగరంలో ఉంటున్నాడు. తన ఈ 'గ్రేట్‌నెస్'ని ఎవరు ఎక్కడ 'నోటీస్' చేయరో-అని భయపడి-అందుకోసమని, పై డైలాగ్‌ని అనడం అవసరంగా భావించే, అలవాటు చేసుకున్నాడు చిరంజీవరావ్)

కొంచెంసేపాగి "బగర్స్! .ఇడియట్స్ స్కౌండ్రల్స్! ..బా. " అనబోయి మళ్ళీ ఆగిపోయాడు-చుట్టూ ఉన్నవాళ్ళందరూ 'తమని తిడుతున్నాడు'—అని అపార్థం చేసుకుని తిరగబడి కొట్టగలరన్న ముందుచూపుతో.

అర్జెంటుగా చేతివాచీవంక చూసుకున్నాడు. అక్కడ వాచీలేదు. అది మొన్ననే సిక్‌లీవ్ తీసుకుని 'వాచీ హాస్పిటల్'లో 'ఎడ్మిట్' అయింది. ఎలానూ చేతివైపు చూసాడు గదా, ఆట్టే మర్యాదగా వుండదని, 'మైమ్' చేసాడు వాచ్ చూసినట్లుగా. 'హెల్ విత్ ద టైమ్'— 'ట్వెంటీవన్ అవర్స్, ట్వెంటీటూ మినిట్స్, ఎండ్ ట్వెంటీ. త్రీ సెకండ్స్" . . . అనుకున్నాడు, కలకత్తాలో '174' డయల్ చేసినప్పుడల్లా టైమ్ చెప్పే ఆడటెలిఫోన్ ఆపరేటర్. . ప్చ్ . ప్చ్ టెలిఫోన్ ఆడఆపరేటర్ వాయిస్‌ని ఇమిటేట్ చేస్తూ. 'ఓన్లీ థర్టీన్ మినిట్స్ అన్డ్ జీరో జీరో సెవెన్ సెకెండ్స్ మోర్—అనుకున్నాడు ఆలిండియా రేడియో రన్నింగ్ కామెంటేటర్‌లా.

వెనక్కితిరిగి చూసాడు. అప్పుడే తన వెనకాల అరఫర్లాంగు 'క్యూ' ఏర్పడిపోయింది. ముందుకు చూసాడు. మందు పుచ్చుకున్నగున్న ఏనుగులా గునుస్తూ నడుస్తోంది 'క్యూ'.

చిరంజీవ రావ్‌కి సడన్‌గా ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా, వాడివాడిగా, వేడివేడిగా కోపం వచ్చేసింది.

"ఇదేమైనా ధర్మాసుపత్రి సహాయార్థం

అరేంజ్ చేసిన క్యాబరే డ్యాన్స్. సింగిల్ డే, 'సింగిల్ షో'నా!-అందరూ ఈ 'ట్రెయిన్'కే ఎగబడ్డారు. కొందరు మరో ట్రెయిన్‌లోనూ, మరికొందరు బస్సులలోనూ పోకూడదూ"— విసుక్కుంటూ గొణిగాడు విశ్వనాధమూర్తితో.

"యూ ఆర్ కర్రెక్టు!— సెంట్ పర్సెంట్ కర్రెక్టు!. అసలు కొందరు 'ప్లెయిన్'లలోనూ కొందరు 'షిప్'ల్లోనూ పోరాదూ—" అందామనుకున్నాడు విశ్వనాధమూర్తి. కాని అన్లేదు- చిరంజీవరావు ఎక్కడ 'అర్థం' కాకుండా 'అపార్థం' చేసేసుకుంటాడో అని భయపడి.

ఇంతలోనే చిరంజీవరావు నోరు తెరిచాడు.

"ఛీఛీ! . ఇక్కడ రోడ్లమీద ఓడలు కాదు సరికదా-చిన్నచిన్న పడవలు కూడా వెళ్ళవు. ఇదే కలకత్తాలో అయితేనా... ఇలా ఒక్క చినుకు పడితే చాలు, ఎక్కడ బస్సులక్కడ ఎక్కడ 'ట్రాము'లు అక్కడ ఆగిపోయిన కారణంగా, ప్రయాణీకుల సౌకర్యార్థం— ప్రత్యేకంగా, అప్పటికప్పుడు రోడ్ల మీద మోటారు బోట్లు నడిపేస్తారు ఒక్క చినుకు నాలుగు చినుకుల యిందా?!"

"..ఇక బంగాళా ఖాతంలోంచి ఓడలు డైరెక్టుగా రోడ్లమీదకే ఒచ్చేసి, బస్టాపుల్లో నిలబడిపోయిన మనుషులందర్నీ ఎక్కించుకుని సురక్షితంగా ఇంటింటికీ తీసుకువెళ్ళి దింపుతాయి." అంటాడు కాబోసు, అనుకున్నాడు విశ్వనాధమూర్తి.


'ఇప్పుడు కాదు. టైం వుంది'—అన్నట్లుగా నోరు మూసేసాడు చిరంజీవరావు.

ఈసారి "అసలు నన్నడిగితే ఒక్కొక్క ఊరికి సంబంధించిన టిక్కెట్లు అమ్మడానికి ఒక్కొక్క బుకింగ్ ప్రత్యేకంగా వుండాలి. ఇదే కలకత్తాలో ఐతేనా.." అనబోతాడు

## శ్రీసంజీవ్

చిరంజీవరావు, అనుకున్నాడు విశ్వనాధమూర్తి.

అందుకు సమాధానంగా "అస్సలు బుక్కింగులే వుండవ్; ఎందుకంటే-అసలు అక్కడ టిక్కెట్లు కొనేవాళ్ళే యెవరూ వుండరు—..; ఎందుకంటే, మనకి ఇక్కడ చాలామందికి సొంతసైకిళ్ళు ఉన్నట్లుగా, మీ కలకత్తాలో ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క 'ఓన్ ట్రెయిన్' (సొంతరైలు) ఉంటుంది. దానిలోనే ఆఫీసులకీ బజారులకీ, సినిమాలకీ వెళ్ళొస్తుంటారు... కదూ....!" అందామనుకుని, ముందే ప్రిపేర్ చేసుకుని వుంచుకున్నాడు విశ్వనాధమూర్తి.



'టైం! ఒచ్చేసింది' అనుకుని—నోరుతెరిచాడు చిరంజీవరావు.

ఆత్రుతగా ముందుకు వంగాడు విశ్వనాధమూర్తి.

'హాఛ్ఛి' అని తుమ్మి ఊరుకున్నాడు చిరంజీవం.

'చిరంజీవి! చిరంజీవి!' అంటూ యేదో పోగొట్టుకున్నవాడిలా నిరుత్సాహ పడిపోయాడు విశ్వనాథం.

మళ్ళీ 'షైమ్' 'షైమ్' చేసాడు చిరంజీవి. (కలకత్తా ఆంధ్ర అసోషియేషన్‌లో గొప్ప 'మైమ్ ఆర్టిస్టు' గదామరి.)

'టెన్ మినిట్స్ అన్డ్ థర్‌టీన్ సెకెండ్స్ ఓన్‌లి' అనుకున్నాడు—ఒళ్ళు మండు తున్నట్లుగా. చిరంజీవరావు విడిచిన ఈ ఒక్క వేడి ఆవిరి నిట్టూర్పు వలన—శక్తివచ్చిన 'స్టీమ్ ఇంజన్'లా హుషారుగా మొదలుపెట్టింది—'క్యూ.'

'కెవ్వు—' మని కేకవేసాడు చిరంజీవరావు. తన నెత్తిమీద, సీలింగ్ ఊడిపడుతోం దనుకొని అదిరిపడి పారిపోబోయి, నెత్తి తడుముకుని, తమాయించుకున్నాడు విశ్వనాథమూర్తి.

ఇంతకి జరిగిందేమిటంటే, చిరంజీవరావు క్యూలో ఆరోమనిషనగా ఓ కాకీబట్టల పోలీస్ ఇన్‌స్పెక్టరు, సుడిగాలిలా వచ్చి, తన 'వేలు విడిచిన 'ఎక్స్'గాడి 'టిక్కెట్'కోసం, క్యూలు ప్రజలకోసమేగాని ప్రభువులకోసం కాద'న్నట్లు సరాసరి బుకింగ్ దగ్గరకివచ్చి, టిక్కెట్ పుచ్చేసుకుంటున్నాడు.

ఆంధ్ర కేసరిలా గాండ్రించాడు-చిరంజీవి.

తాండ్రపాపయ్యలా గర్జించాడు-చిరంజీవి.

"డామిట్! స్టాపిట్!"—మైమ్‌లో కాదు 'రైమ్'లో అరిచాడు చిరంజీవి.

సబిన్‌స్పెక్టర్ టోపీ గమ్మత్తుగా అదిరిపడి, జారిపోయింది. బుకింగ్‌లోవున్న గుమస్తా కళ్ళజోడు, జర్రునజారి ముక్కు కొనకుతగిలి ఆగిపోయింది.

"విమ్ ఆర్ జస్ట్ ఫూల్స్ టు స్టాండ్ హియర్ ఇందిస్ బ్లడీ క్యూ." (ఈ వెధవ వరుసలో నిలుచుని వుండటానికి మేము వెర్రి వెధవలం?) అన్నాడు వ్యంగ్యంగా చిరంజీవరావు.

"యూ మీన్ టూసే ఐయామ్‌ఏఫూల్?" (అంటే మీ వుద్దేశ్యం—నేను వెధవనా)—ఇన్‌స్పెక్టర్‌కి అర్జంటుగా తన నెత్తిమీద టోపీ, చేతిలో 'స్టిక్కూ' గుర్తొచ్చాయి.

"అఫ్‌కోర్స్! ఐ మీన్ టు సే దట్." (అవును నేను ఖచ్చితంగా ఆ వుద్దేశంతోనే అన్నానయ్యా!).. చిరంజీవికి బియ్యేలో బట్టీ పట్టిన ఫండమెంటల్ రైట్స్ గుర్తుకొచ్చాయి. హిందీనటుడు 'షాట్‌గన్ (శత్రుఘన్) సిన్హా' పోజ్‌లో రెండుకాళ్ళూ స్టాండ్ ఎట్ ఈజ్‌లో వుంచి, ఎడమచేతిని నడుముమీద పెట్టుకుని, కుడిచేతి చూపుడువ్రేలును, 'పిస్తోలు' లాగ ఇన్‌స్పెక్టర్ గుండెలపైవుగా చూపిస్తూ—అన్నాడు.

"అంతే!"....అన్నాడు సబ్బిన్‌స్పెక్టర్.

"అంతే!"—అన్నాడు చిరంజీవయ్యర్.

షటప్పన్నాడు టోపీవ్రాప్.

గెటౌటన్నాడు సిసింద్రీరావ్.


స్టిక్‌చుట్టూ ఇన్‌స్పెక్టర్ పిడికిలి బిగుసుకు పోయింది. (డిక్టేటర్ పిడికిల్లాగ కాదు. హిస్టీరియా పేషెంట్ పిడికిలిలా.)

అంతే; చిరంజీవరావ్‌కి హుషారొచ్చేసింది. సబిన్‌స్పెక్టరు, ఖంగుతిన్న ఈ దృశ్యంచూసిన 'క్యూ' మిత్రులంతా ఒక్కసారిగా, — కురుక్షేత్రంలో, అంతవరకూ దూరంగా నిల్చున్న ఎక్స్‌ట్రా సైనికులందరి పైపూ కెమేరా మూవ్ చేసినప్పుడు, వాళ్ళకి అమాంతం సరదాపుట్టేసి కత్తి పుచ్చుకుని లెన్స్‌మీదకొచ్చి చెడామడా చెడీ చేసేసినట్లుగా. యుద్ధం సీనులోకి దిగిపోయారు.

చిరంజీవరావుకి పిచ్చెత్తి పోయింది. అరిచేస్తున్నాడు. కరిచేస్తున్నాడు. జుట్టుపీకేసుకుంటున్నాడు. చేతులు ఝాడించేస్తున్నాడు.

అందరూ కలసి ఒక్కసారిగా ఇన్‌స్పెక్టర్ మీదబడ్డారు. ఇన్‌స్పెక్టర్ ఖంగారుపడి పోయాడు. బెంబేలెత్తి పోయాడు. మంచి వాళ్ళకు రోజుల్లేవనుకున్నాడు. అధర్మయుద్ధంలో అభిమన్యుణ్ణనుకున్నాడు. తనకి నాటకాల్లో బహుమతులొచ్చాయన్న విషయం గుర్తొచ్చి, విషాద ఘట్టంలో హీరోలా 'హయ్యో' అనుకుంటూ, నుదిటిమీద గుప్పెటతో కొట్టుకో

## (వి) చిత్ర విజ్ఞానం



పేడను పిడకలుచేసి వంటచెఱుకుగా ఉపయోగించడం మన అలవాటు. కొలరాడో, అబర్న్ యూనివర్సిటీలలోని డా॥ సెక్లర్, డా॥ బ్రాడీ, పేడలో సుమారు ఎనభై శాతం సత్తువయిన పదార్థాలున్నట్లు తెలుసుకున్నారు. పేడను శుభ్రపరచి వచ్చటి పొడరు (పొడి)ను తయారు చేసి దాన్ని పశువులకు ఆహారంగా వాడితే, పశువులు ఆరోగ్యవంతంగా వుంటాయంటున్నారు. అమెరికాలోని సిరిస్‌లాండ్ కంపెనీ ఇందుకై ఒక పెద్ద ఫ్యాక్టరీ నెలకొల్పింది!

పోయి, ఆ స్థానంలో టోపీ తగలడంతో దాన్నో సారి సరిచేసుకుని, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

"గివ్ దట్ టికెట్ బాక్—" (ఆ టికెట్టు తిరిగి యిచ్చేయండి!) — చించుకున్నాడు చిరంజీవి.

హంటర్‌దెబ్బ తిన్న సర్కస్ సింహంలా 'హుం'—అనుకుంటూ గుమాస్తాకి టికెట్ అందించేసాడు ఇన్స్పెక్టర్.

"కమాన్! గో అండ్ స్టాండ్ యిన్‌ద క్యూ—" (రండి. వెళ్ళి క్యూలో నిల్చోండి) అన్నాడు చిరంజీవి.

వికృచచ్చిపోయాడు ఇన్స్పెక్టరు. చింత చచ్చినా పులుపు చావదన్నట్లుగా, కుడిచేత్తో 'స్టిక్'ని ఎడమ అరచేతిలో 45 డిగ్రీల కోణంలో కొట్టుకుంటూ, తన వేలువిడిచిన 'ఎక్స్' గాడిదనే క్యూలో నించోమని, తను మాత్రం మాచ పీఛే మూడ్—మూడులో నిలబడిపోయాడు.

'క్యూ'లో అందరూ "హహ్హహ్హ..." అని నవ్వుకున్నారు.

రాజేష్‌ఖన్నా, వినోద్‌ఖన్నా, వుడ్‌బీఖన్నా లందరి పోజులూ చకచక మార్చేస్తున్నాడు. చిరంజీవరావ్ అన్నట్టు కలకత్తావాణ్ణి 'కదూ' అది గుర్తొచ్చి నాలిక్కరుచుకుని ...'ఉత్తమ కుమార్'లా ఊగిపోయాడు.

అందరూ 'ఆహా' అన్నారు. 'ఓహో' అన్నారు. 'శుష్కించిపోతున్న ఆంధ్ర ప్రజానీకంలో చైతన్యం తీసుకువచ్చాడన్నారు. 'మహానాయకుడు వెలిసా'-డన్నారు. 'మరో ఆంధ్ర సింహం'-అన్నారు. తను మాత్రం 'బెంగాల్ టైగర్'ని అనుకున్నాడు.


పేపర్లో వేసేయాలన్నారు; దండలు వేసి తీసేయాలన్నారు; నిలబెట్టి శిలావిగ్రహం కట్టించి పారేయాలన్నారు;—కాని ట్రెయిన్ టయిమ్ అయిపోవడంతో ఆ ప్రోగ్రామ్‌లన్నీ పోస్ట్‌పోన్ చేసుకున్నారు.

గుమాస్తా మొహంలోకి గబ్బర్‌సింగ్ పోజ్‌పెట్టి, టికెట్ తీసుకుని అందర్నీ ఒక్కసారి అలా ... అలా .... 'సంజీవ కుమారుడి'-లా శాంతంగా కలయజూసి, తమాషాగా కాలర్ ఎత్తుకుని, ప్లాట్‌ఫాంమీదకి వచ్చాడు చిరంజీవరావ్. అనుసరించాడు విశ్వనాథమూర్తి.

"మరీ ఎక్కువగా దులిపేసావేమోరా?! ... ఏదో టికెట్ తీసుకున్నాడే అనుకో ..దానికి ఇంత. "బెదురుతూనే ధైర్యంచేసి అనేసాడు, విశ్వనాథమూర్తి.

బుద్ధుడయిపోయినవాడల్లా ఫ్లాష్‌బ్యాక్ ఒచ్చి, నరసింహావతారం ఎత్తేసాడు చిరంజీవరావు.

"—ఇదిగో యిలా ప్రతివిషయానికి ఎడ్జస్ట్ అయిపోతున్నాం గనుకనే మనం ఇలా ఏడిస్తున్నాం. వాళ్ళు అలా రెచ్చిపోతున్నారు




రూల్ అంటే రూలే. ఇన్‌స్పెక్టర్ కాదు. వాడి గ్రాండ్ ఫాదర్... కాదు-గ్రేట్ గ్రేట్ గ్రేట్ గ్రాండ్‌ఫాదర్ కాదు ... 'రూలు' అన్నది ఎవరికైనా ఒక్కటే... ఎ రూల్ ఈజ్ ఎ రూల్ ఫర్ ఆల్. ఇదే కలకత్తాలో అయితే ఏం చేస్తారో తెల్సా?!—ఇలా 'క్యూ'లో నుంచోకుండా పొరపాటున ప్రక్కగా, విడిగా నుంచుని బుకింగ్‌వైపు కన్నెత్తి చూశావో!—నిన్ను అమాంతం కాళ్ళు చేతులు కట్టేసి, చాపలో చుట్టేసి, రైల్వే ట్రాక్‌మీద విసరేస్తారు.. కాబట్టి సోదరులారా ఇంతకీ నేను చెప్పొచ్చేదేవిటంటే. .."

"ఇప్పటికే కాలాతీతమై పోయింది. కాబట్టి ఇంతటితో విరమిస్తున్నాను—అని" అన్నాడు విశ్వనాథమూర్తి చిరంజీవరావుకి అడ్డుతగిలి.

'వీడింక రైలెక్కడు; నన్ను ఇంటికి బస్సెక్క నివ్వడు; మన కెవ్వరికీ యింక దక్కడు' అని భయపడ్డాడు విశ్వనాథమూర్తి. అందుకే ధైర్యపు విసుగుతో, టాపిక్ మారుస్తూ అన్నాడు—"అన్నట్టు ఇంతకీ నీకు రిజర్వేషన్ లేదు. ఏం అవస్థ పడతావో ఏమిటో .."

పల్లెటూరి వైతును చూసినట్టు చూసాడు చిరంజీవరావు. "హె. అవస్థా?" ఈమాత్రం తెలీదా ఫూల్' అన్నట్టుగా నవ్వాడు చిరంజీవరావు.

"అక్కడే వుందోయ్ మన చిరంజీవి గ్రేట్‌నెస్. మొత్తం ఈపాటికి యిండియా అంతా రౌండ్ కొట్టేసాను. కాని ఎప్పుడైనా ముందుగా రిజర్వు చేసుకున్నానా?....నెవ్వర్. కానీ ఎప్పుడూ దర్జాగా 'బెర్త్'మీదే వెళ్ళాను! ఎలాగ? సింపుల్. కండక్టర్ దగ్గరకివెళ్ళి చేతిలో అయిదురూపాయలు పెటితేఅయిపోయె. బెర్త్‌నీది. 'మేనేజ్' చెయ్యగలగాలోయ్. 'మేనేజ్—'' చిరంజీవరావ్ వేదాంతం సత్యనారాయణలా వేళ్ళూ కళ్ళూ తిప్పుతూ—కూచిపూడి పోజులో అన్నాడు. ('మేనేజ్' అన్న పదం చిరంజీవ్‌కెంతో ఇష్టం. ఎందుకంటే అది కలకత్తా జనాలకి ఎంతో ఇష్టం.)

అదే సమయానికి అక్కడికి ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు వచ్చాడు. జుత్తంతా 'సుందర్బన్స్'లా చిందరవందరగావుంది. గెడ్డంమీద 'వీడ్స్' బాగా పెరిగిపోయి వున్నాయి. వాడి ఒంటిమీద 'బెంగాల్ పులి'లా చారల బనీనూ గట్రా గట్రా ..లేవు. ఏదో మాసిపోయిన చొక్కా, మాసికల పైజామా శరీరంమీద

వ్రేలాడుతున్నాయి. చూడగానే 'బ్రతికి చెడ్డ వాడు' అనిపిస్తుంది.

"బెర్త్ సార్. . బెర్త్—కావాలా" అన్నాడు. చిరంజీవరావ్ మొహం ఎలక్ట్రిక్ బల్బ్‌లా వెలగలేదు. దీపావళి చిచ్చుబుడ్డిలా పువ్వులు చిమ్మింది. "త్రీటయిరా, టూటయిరా?"—అన్నాడు చిరంజీవి.

"ఏటయిరూకాదు. జనరల్ కంపార్టుమెంట్" అన్నాడు కుర్రాడు. ఒక్కక్షణం నసిగాడు చిరంజీవరావు. కాని మళ్ళీ ఆలోచించాడు. 'రెండ్రూపాయలు...చాలా చవగ్గా వచ్చేస్తోంది... అయినా ఏటయిరయితే ఏమిటి? ఓ రాత్రి జర్నీ ఇంకా చేస్తే బేరంచేస్తే కొంచెం తగ్గొచ్చు కూడాను'... అనుకున్నాడు.

"రెండ్రూపాయలా! అక్ఖర్లేదు. రూపాయి బస్! " అన్నాడు.

"కిట్టదు బాబూ;రెండు రూపాయలు దయుంచండి—"

"నో నో నథింగ్ డూయింగ్; రూపాయి! అయినా ఏవిటయ్యా! . మాకేమయినా బలవంతమా?"

"సాక్ సార్. పోనీ రూపాయిన్నరిప్పించండి సార్!—"

చిరంజీవిరావు ఆగాడు. ఏదో ఆలోచించడంకోసం బుర్ర గోక్కున్నాడు. బలవంతంగా పుస్తె కట్టించుకుంటున్న పెళ్ళికూతుర్లా.... "ఊ! సరే-పద" అన్నాడు.

ముగ్గురూ కలిసి జనరల్ కంపార్ట్‌మెంట్ వైపుకి నడిచారు. జనం లోపల తోక్కేసుకుంటున్నారు. లోసేసుకుంటున్నారు. విశ్వనాధమూర్తి బయట నిల్చున్నాడు. లోపలకి చిరంజీవరావూ, ఆ కుర్రాడూ ఎక్కారు. విండో దగ్గర సీటుమీదా, ఎదురుగా వున్న 'బెర్త్' మీదా రెండు తుండుగుడ్డలు పరిచివున్నాయి. 'ఇది సీటు, ఇది బెర్తు' అని చూపించాడు. 'దట్స్ గూడ్!' అనుకున్నాడు. కుర్రాడు డబ్బూ తుండు గుడ్డలూ తీసుకుని దిగిపోయాడు. బెర్త్ మీద హోల్డాల్ పరిచేసి, దానిమీద ఎవరూ కూర్చోకుండా సూట్‌కేస్ పెట్టి, విండో దగ్గర కొచ్చి కూచున్నాడు.

ఆలశ్యం అయితే వాళ్ళావిడ 'జ్యోతమ్మ' కేకలు వేస్తుందని భయపడి, బై! బై! చెప్పి వెళ్ళిపోయాడు విశ్వనాధమూర్తి.

కిటికీలోంచి ఓసారి అలా విలాసంగా బయటకి తలకాయ వంచి చూసాడు. ప్రక్కనే వున్న మరో కంపార్టుమెంట్ దగ్గర ఇందాకటి ఇన్‌స్పెక్టర్ కనిపించాడు. కండక్టర్‌తో ఏదో 'మేనేజ్' చేసాడు కాబోలు చూస్తుండగానే అతగాడి 'ఎక్స్' గాడిదని లోపలకి ఎక్కించేసాడు. 'హర్రి' అనుకున్నాడు చిరంజీవి. అలా అనుకుంటూ బుర్ర పైకెత్తడంలో విండోచేత రక్కున మొట్టికాయ కొట్టించుకున్నాడు. 'ఓ గాడ్!' అని ఇంగ్లీషులో బావపడిపోయాడు.

కిసుక్కున నవ్వొకటి ఈసీను వైపుగా దూసుకు వచ్చింది, తన సీటుకి కొంచెం అటువైపుగా, ఎదురుగా ఓ స్వీటీ, బ్యూటీ, బటర్‌ఫ్లై


'ఓ మై గుడ్ గాడ్!' అనుకున్నాడు. 'దట్స్ గూడ్! దట్స్ గూడ్!' అనుకున్నాడు. గాడెస్ అనుకున్నాడు. 'గ్లాడ్ టు సీ యూ' అని కూడా అనేసాడు మైమ్‌లో.

క్రాఫ్ సవరించుకున్నాడు. కాలర్ నిదించాలో ఎత్తాలో అర్థం కాక, అలాగే వుంచేసాడు.

ఇంతలో ప్లాట్‌ఫాం మీద ఒక్కసారిగా పెద్ద అలజడి; అందమైన కల చెదరగొడుతూ 'అలారం' మ్రోగినట్టుగా చిరాకుపడిపోయాడు చిరంజీవుడు.

"కొట్టండి-తన్నండి- చీరండి వెధవని" పెద్ద గుంపు. మధ్యలో ఇందాకటి కుర్రాడు.

"బ్లాక్ చేస్తున్నాడండీ బ్లాకూ! రైలు ఇంకా స్టేషన్‌లోకి రాకుండానే, జనరల్ కంపార్టుమెంటులో ఔటర్‌లోనే ఎక్కేసి, అరంగుళం జాగా కనిపిస్తే చాలు తుండుగుడ్డలు పరిచేసి, వాటిని ఒకటికీ, రెండుకీ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారండీ వెధవలు. వెధవ. వ్రేలెడు వెధవకి బ్లాకు బ్లాకు " అంటూ అరుస్తున్నారు ఓ బాల్డ్‌హెడ్, బ్లాక్ స్పెక్స్,




బఫేలో పురుషుడు— ఆ కుర్రాడికి ప్రసాదం ఒడ్డించడంలో జారిపోయిన తన వాచీ, బ్లాక్ గోల్డు చెయిన్‌ని సరిచేసుకుంటూ.

'ఆఫ్ ది పీపుల్; ఫర్ ది పీపుల్; బై ది పీపుల్' అన్న ప్రజాస్వామ్య సిద్ధాంతాల్ని శిరసావహిస్తున్నామన్న సంతృప్తితో గాబోలు, ఆ కుర్రాడి మీద ప్రతి ఒక్కరూ శక్తికొలదీ శ్రమ దానం ప్రదర్శిస్తున్నారు. కొందరు కథ కళి ఆడేస్తే, కొందరు పిడికిళ్ళతో బాక్సింగ్ చేస్తున్నారు. ఇంకొందరు కాళ్ళతో ఫుట్‌బాల్ ఆడేస్తున్నారు.

ఆ కుర్రాడు 'బాబోయ్-అమ్మోయ్!' అని అరుస్తున్నాడు.

'లబో దిబో'మని ఏడుస్తున్నాడు.

"బాబూ! ఈ పాలికి వదిలేయండి బాబూ ఇంకెప్పుడూ సెయ్యను బాబూ! . బాబూ! ... తప్పయిపోనాది—చ్చెమించండి బాబూ! ..." అని అందరి కాళ్ళూ పట్టుకుని, గుండెలవిసేలా గుండెల్ని కరిగించేలా, ఏడుస్తున్నాడు ఆ కుర్రాడు.

"ఈ వెధవలందరూ ఇంతేనండీ! అందితే జుట్టు. అందకపోతే కాళ్ళు. వెధవని ఇలా కాదు. పోలీసుల కప్పజెప్పండి!—" అన్నాడు సీటు విషయంలో ఆ కుర్రాడితో సెటిల్మెంటు కుదరక సీటు కోల్పోయిన ఓ అభ్యుదయవాది.

"ఔను పోలీసుల కప్పజెప్పండి...పోలీసుల కప్పజెప్పండి.. " అందరూ ఏకగ్రీవంగా, ముక్తకంఠంతో అరిచేరు. "హాబ్బా సమిష్టి భారతంలో ఎంత ఐకమత్యం! ఎంత ఐకమత్యం!"....అనుకుని రొమ్ములు విరుచుకుని, మురిసిపోయారు.

దుష్టశిక్షణార్థం భక్తుల మొరనాలకించి ప్రత్యక్షం అయిన ఆదినారాయణమూర్తిలా— చేతిలో స్టిక్‌ని సుదర్శన చక్రంలా తిప్పుకుంటూ పరుగెత్తుకొచ్చాడు—ఇందాకటి ఇన్స్పెక్టర్. (హాశ్చర్యం! ఇప్పుడు వెంట రెడీమేడ్ పోలీసు కూడా ఉన్నాడు)

'సంభవామి యుగే యుగే'-అన్న శ్లోకం చదివేసి, ఆశ్చర్యంతో, ఆనందంతో చేతులు జోడించారందరూ.

ఇన్స్పెక్టర్ సీన్‌లోకి వొస్తూనే, ఎదురుగా విండో దగ్గర కూర్చుని ఉన్న తనను చూసాడు అంతే! కుర్రాడిమీద విరుచుకుపడిపోయాడు. 'రాస్కెల్', 'స్కౌండ్రల్' అని ఆబోరులా అరుస్తూ, ఆ కుర్రాడిజుట్టు పట్టుకుని లేవదీసి, వాడి చెంపమీద ఎడాపెడా' ఛడామడా, పెన్ని సాదేసాడు.

కుర్రాడు హృదయ విదారకంగా ఏడుస్తు

న్నాడు. "నన్ను జైలు కొట్టుకెళ్లకండి బాబూ! మా యిల్లు ఇల్లంతా నా మీదే వుంది బాబూ! నేను లేకపోతే మా ఓల్లంతా సెల్లాసెదరై పోతారు బాబూ!. ఇంకెప్పుడూ సెయ్యను... ఈ పాలికి ఒగ్గీయండి బాబూ!"—ఆ కుర్రాడి కళ్ళలో ఉప్పెనలా పొర్లుకు వస్తున్నాయి నీళ్ళు.

అయినా అదేం చూట్టంలేదు ఇన్‌స్పెక్టర్. చిరంజీవరావునే చూస్తున్నాడు. చూపుల్తో మింగేస్తున్నాడు. పళ్ళు పటపటమని కొరుకుతూ 'షటప్'—అన్నాడు. 'నాన్సెన్స్!' అన్నాడు. "ఐ.పి.సి డాష్ డాష్ . (——) సెక్షన్ ప్రకారం యూ ఆర్ అండర్ అరెస్ట్—" అన్నాడు స్టిక్‌తో కసుక్కున కుర్రాడు కడుపులో పొడిచి, రెక్క పట్టుకు ఈడ్చుకు పోయాడు కూడా వచ్చిన కానిస్టేబిల్ పక్షి.

సడన్‌గా ఏదో ఆలోచన వచ్చి, అంత వరకూ స్టేడియంలో కూర్చుని, బైనాక్యులర్ లోంచి 'మాచ్‌ని' క్లోజప్‌లో చూసినట్లుగా ఆనందించిన వాడల్లా ఒక్కసారిగా, ఆ ఇన్‌స్పెక్టర్ స్టిక్‌ని తన కడుపులో పొడిచి నట్లుగా ఫీలయ్యాడు చిరంజీవరావు.

అమాంతం కరెంటు పోయినపుడు, స్టేజి మీద స్టేట్యూలా నిలబడిపోయిన హీరోమీద, ఆడియన్స్‌లోంచి ఎవరో ట్యార్చిలైట్ ఫోకస్ చేసినట్లుగా అయిపోయాడు.

క్షణంలో క్షణంపాటు—చిరంజీవరావులో ఉన్న 'అహం' అంతా ఎటో ఎగిరిపోయింది.

'తనకి తెలియకుండానే తనెంత తప్పు చేశాడు. 'క్యూ'లో నిల్చున్నప్పుడు 'రూల్స్' గురించి చెప్పేరిచాడు. నిజానికి, 'తనకన్న ముందుగా మరొకడు టికెట్ పుచ్చేసు కుంటున్నాడే!—అన్న ఉక్రోషంలో-ఉపన్యాసం దంచాడు. కాని, అప్పుడు తనకి తెలియ కుండానే, తాను తన స్వార్థానికి, అహానికి 'రూల్'ని అడ్డు వేసుకుని, తను చేసింది 'రైటు'—అని బోరవిచ్చుకున్నాడు. రైల్లో కూర్చోవడం గొడవ వచ్చేసరికి, బ్లాక్‌లో సీటు కొనుక్కుని, న్యాయంగా మరొకడికి రావల్సిన సీటుని తాను కొట్టేశాడు. ఇక్కడ తనకి తెలియకుండానే తన స్వార్థాన్ని తన గొప్పతనంగా జమకట్టుకుని, తనకి తాను తెలివిగా సమర్థించుకున్నాడు. 'క్యూ'లో నిలుచున్నప్పుడు బాణంలా దూసుకు వచ్చిన 'రూలు'—సీట్లో కూర్చోవడం దగ్గర రెక్క లొచ్చి చక్కాపోయింది. ఇన్‌స్పెక్టర్‌ని చూపుడు వ్రేలితో చూపించడానికి మాత్రం ఆ రూలు అక్కడ అక్కరకు వచ్చింది. ఎంతలో ఎంత తేడా?!—ఎంతలో ఎంత మార్పు?!

చూపు మరల్చి కంపార్టుమెంటు అంతా ఓ సారి కలియచూసాడు. ఓ మూలగా, ఓ మూడు కాళ్ళ ముసలావిడ, కూర్చోవడానికి సీటులేక, నిల్చోడానికి చోటులేక ఒంటి కాలిమీద త్రిశంకు స్వర్గంలో వ్రేలాడుతోంది. పాపం! బోలెడు జాలి పుట్టుకొచ్చేసింది చిరంజీవరావుకి. పోనీ తను చేసిన తప్పుని సవరించుకుందామా అను కున్నాడు. పోనీ తను లేచి తన సీటుని ఆ మామ్మగారికి ఇస్తే !

ఒకటి రెండు. మూడు . సత్యజిత్ రాయ్ పిక్చర్లోలా, అంతా నిశ్శబ్దం చుట్టూ చీకటి మధ్యలో స్పాట్ . అందులో హీరో. హీరోలో తీవ్ర అంతర్ సంఘర్షణ టిక్.... టిక్ టిక్. కట్!

ఏదో అజ్ఞాత శక్తి తనని తట్టి లేపినట్లు ఫీలయి చటుక్కున సీటులోంచి లేచాడు. 'హాత విడీ!' అనుకున్నాడు. 'లేదు, లేదు, లేదు-ఈ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు' అనుకున్నాడు.

అలా అనుకుంటూ, ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా, సీటు మీద ఇందాకట్నుంచి తనకి గుచ్చుకుంటూ, తనని తట్టి లేపిన వేరు సెనగకాయ తొక్కల్ని దులిపేసి, ఇందాకటి స్వీటీ, బ్యూటీ, బటర్‌ఫ్లై తనకి సరిగ్గా కనబ డేట్లుగా ఏంగిల్‌ని ఎడ్జస్టు చేసుకుని, అమాంతం చతికిలబడ్డాడు-చిరంజీవి. చిరంజీవి చిరంజీవ రావు.

కూర్చున్న చిరంజీవరావునూ, నిల్చున్న 'నిలబడలేని' ముసలావిడనూ, చిరంజీవరావు చూస్తున్న తియ్యని సీతాకోక చిలుకనూ తనతో తీసుకొనిపోతూ రైలు కదిలి ముందుకు సాగింది. □